సంగారెడ్డికి ఈవీఎంల తరలింపు

కామారెడ్డి టౌన్, మే 14: జిల్లాలోని కామారెడ్డి, జుక్కల్, ఎల్లారెడ్డి నియోజకవర్గాల్లోని ఈవీఎంలను సంగారెడ్డిలోని గీతం యూనివర్సిటీకి జిల్లా అధికారులు తరలించారు. మంగళవారం ఈవీఎంల భద్రపరిచేస్థలాన్ని ఎన్నికల సాధారణ పరిశీలకుడు గోపాల్‌జీ తివారితో పాటు కలెక్టర్, ఆర్డీవోలు పరిశీలించారు.



సంగారెడ్డి ఈవీఎం భద్రపరిచే స్థలాన్ని పరిశీలించిన అధికారులు





- జహీరాబాద్ లోక్‌సభ ఎన్నికల్లో పెరిగిన పోలింగ్
- ఈ పార్లమెంట్ సెగ్మెంట్‌లో 74.63 శాతం పోలింగ్ నమోదు
- పోలైన మొత్తం ఓట్లు 12,25,049
- గత ఎన్నికలతో పోలిస్తే 6 శాతం పెరిగిన పోలింగ్
- పెరిగిన పోలింగ్ శాతం ఎవరిపై గెలుపోటముల ప్రభావం చూపునో?
- లెక్కలు వేసుకుంటున్న అభ్యర్థులు, ఆయా పార్టీలు
- గెలుపోటములపై అంచనాలు
- అందరిలోనూ గెలుపుపై ధీమా

పెరిగిన పోలింగ్..
ఎవరికి మేలో.. ఎవరికి చేటో!

కామారెడ్డి, మే 14(ఆంధ్రజ్యోతి): జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో పెరిగిన పోలింగ్ శాతం ఏ అభ్యర్థికి మేలు జరుగునో.. ఎవరికి చేటు జరుగునోనని సర్వత్రా చర్చ నెలకొంటుంది. పోలింగ్ శాతం పెరగడంతో అన్ని పార్టీల అభ్యర్థుల్లోనూ టెన్షన్ మొదలైంది. ఓటర్లు ప్రధాన పార్టీల వైపు మొగ్గు చూపినప్పటికీ ఎవరికి ఎన్ని పడ్డాయో దానిపై అభ్యర్థులు లెక్కలు వేసుకుంటున్నారు. అనుచర వర్గాలతో సమావేశాలు ఎక్కడ ఎన్ని ఓట్లు పడ్డాయి అనే దానిపై అభ్యర్థులు, నాయకులు ఆరా తీస్తున్నారు. సోమవారం జరిగిన ఓట్ల పండుగలో జహీరాబాద్ లోక్‌సభలో 74.63 పోలింగ్ శాతం నమోదైంది. గత లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే 6 శాతం పోలింగ్ పెరుగగా ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఈ ఎన్నికల్లో పోలింగ్ శాతం కాస్త తగ్గడంతో ప్రధాన పార్టీల అభ్యర్థులను కలవరపెడుతోంది. పోలింగ్ శాతం తగ్గడంపై ప్రధాన పార్టీల అభ్యర్థుల గెలుపోటములపై తీవ్ర ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు వాపోతున్నారు. ఏది ఏమైనా ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో ఎవరికి వారే తమదే గెలుపు అంటూ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఎవరిని గెలుపు వరించనుంది ఎవరికి ఓటమి కలుగనుందో ఓట్ల లెక్కింపు వరకు వేచి చూడాలి.

పెరిగిన పోలింగ్ శాతం

జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో గత సాధారణ లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే ఈసారి పోలింగ్ శాతం పెరిగింది. అదేవిధంగా ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఈ లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ శాతం కాస్త తగ్గింది. సోమవారం జరిగిన లోక్‌సభ ఎన్నికలకు జహీరాబాద్ ఎంపీ సెగ్మెంట్‌లో రాత్రి 9 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. దీంతో పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో 74.63 శాతం పోలింగ్ నమోదైంది. గత 2019 ఎన్నికల్లో 69.67 శాతం పోలింగ్ నమోదు కాగా ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 79.87 శాతం నమోదైంది. ఈ లెక్కన చూస్తే లోక్‌సభ ఎన్నికల్లో 6 శాతం వరకు పోలింగ్ పెరిగినట్లు తెలుస్తోంది. ఎండల ప్రభావం ఉన్నప్పటికీ ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు క్యూ కట్టారు. కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంలో 71.50, ఎల్లారెడ్డిలో 77.54, బాన్సువాడలో 76.98, జుక్కల్‌లో 75.83, జహీరాబాద్‌లో 72.80, అందోల్‌లో 76.27, నారాయణఖేడ్ 72.71 పోలింగ్ శాతం నమోదైంది.



పోలైన మొత్తం ఓట్లు 12,25,049

జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి జరిగిన ఎన్నికల్లో 12 లక్షలకు పైగా ఓట్లు పోల్ అయ్యాయి. ఈ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో మొత్తం ఓట్లు 16,41,410 ఓట్లు ఉండగా పోల్ అయిన మొత్తం ఓట్లు 12,25,049, ఇందులో పురుషుల ఓట్లు 8,01,862 ఉండగా పోలైన మొత్తం ఓట్లు 6,08,097. మహిళల ఓట్లు 8,36,489 ఉండగా 6,16,936 ఓట్లు పోల్ అయ్యాయి. థర్డ్ జండర్‌వి 59 ఓట్లు ఉండగా 16 ఓట్లు పోల్ అయ్యాయి. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా చూస్తే కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 2,55,007 ఉండగా 1,82,325 ఓట్లు పోల్ అయ్యాయి. ఇందులో పురుషుల ఓట్లు 1,22,474 ఉండగా 56,121 ఓట్లు పోల్ అయ్యాయి. మహిళల ఓట్లు 1,32,514 ఉండగా 96,198 ఓట్లు పోల్ అయ్యాయి. థర్డ్ జండర్‌వి 19 ఉండగా 6 ఓట్లు పోలయ్యాయి. ఎల్లారెడ్డిలో మొత్తం ఓట్లు 2,23,027 ఉండగా 1,72,928 ఓట్లు పోల్ అయ్యాయి. పురుషుల ఓట్లు 1,06,881 ఉండగా, 82,590 ఓట్లు పోల్ అయ్యాయి. మహిళల ఓట్లు 1,16,144 ఉండగా 90,337 ఓట్లు పోల్ అయ్యాయి. థర్డ్ జెండర్ ఓట్లు 2 ఉండగా ఒకటి పోల్ అయింది. బాన్సువాడలో మొత్తం ఓట్లు 1,96,826 ఉండగా 1,51,516 ఓట్లు పోల్ అయ్యాయి. ఇందులో పురుషుల ఓట్లు 93,762 ఉండగా 72,850 ఓట్లు పోల్ అయ్యాయి. మహిళల ఓట్లు 1,03,051 ఉండగా 78,660 ఓట్లు పోల్ అయ్యాయి. థర్డ్ జండర్‌వి 13 ఉంటే 6 ఓట్లు పోలయ్యాయి. జుక్కల్‌లో మొత్తం ఓట్లు 2,02,887 ఉండగా 1,53,885 ఓట్లు పోల్ అయ్యాయి. ఇందులో పురుషుల ఓట్లు 99,524 ఉండగా 77,140 పోల్ అయ్యాయి. మహిళల ఓట్లు 1,03,354 ఉండగా 76,715 ఓట్లు పోల్ అయ్యాయి. జహీరాబాద్‌లో మొత్తం ఓట్లు 2,75,562 ఉండగా 2,00,597 ఓట్లు పోల్ అయ్యాయి. ఇందులో పురుషుల ఓట్లు 1,37,866 ఉండగా 1,03,616 ఓట్లు పోల్ అయ్యాయి. మహిళల ఓట్లు 1,37,866 ఉండగా 96,981 ఓట్లు పోల్ అయ్యాయి. అందోల్‌లో మొత్తం ఓట్లు 2,50,860 ఓట్లు ఉండగా 1,91,320 ఓట్లు పోల్ అయ్యాయి. ఇందులో పురుషుల ఓట్లు 1,22,668 ఉండగా 96,859 ఓట్లు పోల్ అయ్యాయి. మహిళల ఓట్లు 1,28,187 ఉండగా 94,461 ఓట్లు పోల్ అయ్యాయి. నారాయణఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గంలో మొత్తం ఓట్లు 2,37,241 ఉండగా 1,72, 508 ఓట్లు పోల్ అయ్యాయి. ఇందులో పురుషుల ఓట్లు 1,18,859 ఉండగా 88,921 ఓట్లు పోల్ అయ్యాయి. మహిళ ల ఓట్లు 1,18,373 ఉండగా 83,584 ఓట్లు పోల్ అయ్యాయి. థర్డ్ జండర్‌వి 9 ఉంటే 3 పోలయ్యాయి.

ఓట్ల లెక్కలు వేస్తున్న అభ్యర్థులు

నిన్నటి దాకా ఎన్నికల ప్రచారంలో బిజీలో ఉన్న వివిధ పార్టీల అభ్యర్థులంతా మంగళవారం కాస్తా రిలాక్స్ అయ్యారు. ఓట్ల పండుగ ముగిసింది. ఇక ఓట్ల లెక్కింపే మిగిలింది. ఓటర్లు ఎవరికి పట్టం కడుతున్నారన్నది ఈవీఎంలలో నిక్షిప్తమై ఉంది. స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపర్చిన అధికార యంత్రాంగం ఓట్ల లెక్కింపులో నిమగ్నమైంది. మరోవైపు ఎన్నికల్లో పోటీ చేసి అభ్యర్థులు వారి వారి అనుచరుల ఓట్ల లెక్కల్లో తలమునకలయ్యారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోనూ 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో జరిగిన ఎన్నికల్లో పోల్ అయిన ఓట్ల వివరాలను సమకూర్చుకున్న ఆయా పార్టీల అభ్యర్థులు బూత్‌ల వారీగా తమకు వచ్చే ఓట్లపై లెక్కలు తీసుకు ంటున్నారు. ఆయా మండలాలకు చెందిన నేతలు, అభ్యర్థుల వద్దకు చేరుకొని గెలుపోటములపై చర్చిస్తున్నారు. నియోజకవర్గాల్లో ఏ మండలంలో ఎన్ని ఓట్లు పోల్ అయ్యాయి? ఏ వర్గం వారు ఎవరికి వేసి ఉంటారు? మనకు, ప్రత్యర్థులకు ఎన్ని ఓట్లు వస్తాయి గెలిస్తే ఎంత మెజార్టీ వస్తుంది? ఓడితే ఎన్ని ఓట్లతో ఓటమి పాలవుతాం అంటూ అభ్యర్థులు లెక్కలు వేస్తున్నారు. ఓటరు జాబితా, బూత్‌ల వారీగా పోల్ అయిన ఓట్లను పోలింగ్ శాతం లిస్ట్‌లతో అభ్యర్థులు కుస్తీ పడుతున్నారు. పనిలో పనిగా ఎన్నికల సందర్భంగా ఎంత వరకు ఖర్చు చేశామనే దానిపై లెక్కలు వేస్తున్నారు.

మిగిలింది ఓట్ల లెక్కింపు

కామారెడ్డి, సంగారెడ్డి జిల్లాల పరిధిలో జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ఉంది. ఈ పార్లమెంట్ నియోజకవర్గానికి ఎన్నికలు ముగిశాయి. ఈ ఎంపీ సెగ్మెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రశాంతంగా పోలింగ్ ముగిసింది. సోమవారం అర్ధరాత్రే ఈవీఎంలను సంగారెడ్డి జిల్లాలోని గీతం యూనివర్సిటీ స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించారు. అభ్యర్థుల భవితవ్యం ఈవీఎంలో పొందుపర్చబడ్డాయి. ఇక ఓట్ల లెక్కింపే మిగిలి ఉంది. లోక్‌సభ ఎన్నికలు దేశవ్యాప్తంగా జరుగుతున్న నేపథ్యంలో విడతల వారీగా ఎన్నికల కమిషన్ ఎన్నికలను నిర్వహిస్తోంది. నాలుగో దశలో తెలంగాణ రాష్ట్రానికి సోమవారం ఎన్నికలు ముగిశాయి. దేశ వ్యాప్తంగా అన్ని విడతల పోలింగ్ ముగిసిన తరువాతనే ఒకేసారి ఓట్ల లెక్కింపు చేయనున్నారు. జూన్ 4న లోక్‌సభ ఓట్ల లెక్కింపు జరుగనుంది. తెలంగా ణలోని ఎంపీ అభ్యర్థుల భవితవ్యం తేలాలంటే సుమారు 20 రోజుల పాటు వేచి చూడాల్సిందే. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించిన ఓట్ల లెక్కింపు సంగారెడ్డి జిల్లాలోని గీతం యూనివర్సిటీలో జూన్ 4 జరుగనుంది.

గెలుపుపై ఎవరి ధీమా వారిదే..

జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి మొత్తం 19 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీరిలోంచి ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థుల మధ్యనే తీవ్ర పోటీ నెలకొంది. కాంగ్రెస్ పార్టీ తరఫున సురేష్ షెట్కార్, బీజేపీ నుంచి ఎంపీ బీబీ పాటిల్, బీఆర్ఎస్ తరుపున గాలి అనిల్‌కుమార్ పోటీ పడ్డారు. ఈ మూడు పార్టీలకు చెందిన అభ్యర్థులు ఎన్నికల ప్రచారం పోటాపోటీగా నిర్వహించారు. సోమవారం జరిగిన పోలింగ్‌లోనూ ఈ ప్రధాన పార్టీల అభ్యర్థుల వైపు ఓటర్లు మొగ్గు చూపారు. కానీ ఏ అభ్యర్థికి ఏ పార్టీకి వేశారనే దానిపై ఓటర్ల నాడి అంతు చిక్కడం లేదు. కానీ జహీరాబాద్ ఎంపీగా తాను అంటే తానే గెలుస్తున్నానంటూ ప్రధాన పార్టీ అభ్యర్థులు ధీమాతో ఉన్నారు. పోలైన ఓట్లను బట్టి చూస్తే తమ పార్టీకే మెజార్టీ ఓట్లే పడ్డాయని అన్ని వర్గాల ఓటర్లు మా వైపే మొగ్గు చూపారంటూ ఆయా పార్టీల నాయకులు పేర్కొంటున్నారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు అభివృద్ధి పనులు, మేనిఫెస్టోలకు ఓటర్లు పట్టం కట్టనున్నారని తనను ఎంపీగా గెలిపించనున్నారని మాజీ ఎంపీ సురేష్‌షెట్కార్ ధీమా వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలుస్తానని ఆయన పేర్కొన్నారు. మరోవైపు బీజేపీ అభ్యర్థి సిట్టింగ్ ఎంపీ బీబీ పాటిల్ గతంలో తాను చేసిన అభివృద్ధి, కేంద్రంలో బీజేపీ ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి పనులు, మోదీ చరిష్మాతో ఓటర్లు తనను గెలిపిస్తాయని మరోసారి తననే గెలిపించనున్నారని ఆయన వర్గీయులు పేర్కొంటున్నారు. ఇక బీఆర్ఎస్ తరఫున బరిలో గాలి అనిల్‌కుమార్ గతంలో ఆ పార్టీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, ప్రభుత్వ వ్యతిరేకతపై ఓటర్లు తమవైపే మొగ్గు చూపారని బీఆర్ఎస్ వర్గీయులు భావిస్తున్నారు. ఈ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ మరోసారి విజయం సాధిస్తుందని ధీమాతో ఉన్నారు.



బిడ్డ బెయిల్ కోసం..
బీఆర్ఎస్‌ను బీజేపీకి తాకట్టుపెట్టిన కేసీఆర్!

- తెలంగాణ ప్రజల నమ్మకాన్ని బీజేపీకి అమ్మేశాడు
- ఎన్నికల్లో బీజేపీకి ఓట్లు వేయాలని బీఆర్ఎస్ నాయకులే ప్రచారం చేశారు
- మత తత్వపార్టీతో లోపాయికారి ఒప్పందం చేసుకున్నారు
- విలేకరుల సమావేశంలో ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ



కామారెడ్డి, మే 14(ఆంధ్రజ్యోతి): కవిత బెయిల్ కోసం బీజేపీతో కేసీఆర్ అంటకాగుతున్నారని కాంగ్రెస్ ముందటి నుంచే చెబుతోంది. ప్రస్తుతం ఎంపీ ఎన్నికల్లో అది నిజమని నిరూపణ అయిందని బిడ్డ బెయిల్ కోసం బీఆర్ఎస్ పార్టీని పార్లమెంట్ ఎన్నికల్లో కేసీఆర్ బీజేపీకి తాకట్టుపెట్టారని ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ ఆరోపించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని క్లాసిక్‌గోల్డెన్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీని క్యాడర్‌ను, తెలంగాణ ప్రజల నమ్మకాన్ని కేసీఆర్ బీజేపీకి అమ్మేశారని అన్నారు. కేసీఆర్‌కు సెక్యులరిజంపై మాట్లాడే హక్కు లేదన్నారు. మత తత్వపార్టీతో లోపాయికారి ఒప్పందం చేసుకున్నారని అన్నారు. కేసీఆర్ ఆర్ఎస్ఎస్ ఏజెంట్ అని అన్నారు. తమది రీజనల్ పార్టీ అని చెప్పుకునే కేసీఆర్ పార్టీ భవిష్యత్తును 5 నెలల్లోనే భూ స్థాపితం చేశారన్నారు. ఈ ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ కార్యకర్తలు నాయకులు బీజేపీకి ఓటు వేయాలని ప్రచారం చేశారన్నారు. రాష్ట్రంలో 11 స్థానాల్లో కాంగ్రెస్ గెలువడం ఖాయమన్నారు. మోదీకి నార్త్ ఇండియాలో ఎదురుగాలి ఉందని సౌత్ ఇండియాలో ప్రజలు క్లియర్‌గా ఉన్నారన్నారు. జహీరాబాద్‌లో ఎంపీ అభ్యర్థి సురేష్‌షెట్కార్ భారీ మెజార్టీతో గెలువనున్నారని అన్నారు. మార్చి నెలలో కురిసిన రాళ్ల వర్షానికి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. ఎన్నికల కమిషన్ అనుమతితో రాష్ట్ర వ్యాప్తంగా 15వేల ఎకరాల్లో పంట నష్టం జరిగితే కేవలం కామారెడ్డి జిల్లాలోనే 10,400 ఎకరాల్లో నష్టం వాటిల్లిందని అన్నారు. ఎకరానికి 10 వేల చొప్పున ప్రభుత్వం రూ.15కోట్లు విడుదల చేస్తే 10 కోట్లకు పైగా కామారెడ్డి రైతులకు నష్ట పరిహారం వచ్చిందన్నారు. 10 ఏళ్ల కేసీఆర్ పాలనలో ఒక్క రైతుకు పంట నష్టం ఇవ్వలేదని ఆరోపించారు.

జహీరాబాద్ ఎంపీ స్థానం కాంగ్రెస్ ఖాతాలోనే పడనుంది

కామారెడ్డి టౌన్: జహీరాబాద్ ఎంపీ స్థానం కాంగ్రెస్ ఖాతాలోనే పడనుందని, ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్ భారీ మెజార్టీతో గెలుస్తారని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ అన్నారు. సోమవారం కామారెడ్డి జిల్లా కేంద్రంలోని క్లాసిక్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డారు. ఆయా మండల అధ్యక్షుల నివేదికల ప్రకారం 10 నుంచి 12 వేల మెజార్టీ వస్తుందని తెలిపారు. రాష్ట్రంలో గెలువబోయే 11 స్థానాల్లో జహీరాబాద్ ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారని అన్నారు. కామారెడ్డిలో కొంచెం బీజేపీ గాలి ఉందని, జహీరాబాద్, నారాయణఖేడ్, అందోళ్‌లో కాంగ్రెస్ మెజార్టీ సాధిస్తుందని తెలిపారు. మార్చిలో కురిసిన రాళ్లవర్షానికి నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్ట పరిహారం అందించిందని తెలిపారు. ఇందులో కామారెడ్డి రైతులకు రూ.10కోట్లకు పైగా నష్టపరిహారం అందిందని తెలిపారు.

నిగ్గు తేలేనా..
నీరు గారేనా?

- వివాదాల సుడిగుండంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ
- ఉన్నతాధికారులు, సిబ్బందిపై ఏదో రకంగా ఆరోపణలు
- ఎన్ని వివాదాలు చుట్టుముట్టినా పూర్తిస్థాయి విచారణ కరువు
- శాఖ ఉన్నతాధికారిపై కలెక్టర్, ఎస్పీతో పాటు రాష్ట్ర ఉన్నతస్థాయి అధికారులకు మహిళా సిబ్బంది ఫిర్యాదు
- విచారణకు ఆదేశించిన రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అధికారులు
- నేడు కామారెడ్డికి విచారణకు రానున్న రాష్ట్రస్థాయి అధికారి

కామారెడ్డి టౌన్, మే 14: ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించి ప్రతినిత్యం వారి ఆరోగ్యాలను కాపాడుకునేలా జాగ్రత్తలు, సూచనలు చేయాల్సిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పూటకో వివాదాల సుడిగుండంలో చిక్కుకోవడంతో వైద్య ఆరోగ్యశాఖ ప్రతిష్ఠ మసకబారుతోంది. నూతన జిల్లా ఏర్పాటు అయినప్పటి నుంచి వైద్య ఆరోగ్యశాఖలో ఏదోరకంగా వివాదాలు చుట్టుముడుతునే ఉన్నాయి. పట్టుమని పది నెలలు ఏ ఒక్క అధికారి నిలకడగా పని చేసిన దాఖలాలు ఉండడం లేదని సొంత శాఖలోని సిబ్బందే పేర్కొంటుడడం గమనార్హం. కిందిస్థాయి సిబ్బంది పనితీరును పరిశీలిస్తూ వారికి ఆదర్శంగా నిలుస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందేలా చూడాల్సిన ఉన్నతాధికారులు తప్పుదోవపడుతుండడంతో వైద్య ఆరోగ్యశాఖ నిత్యం వార్తల్లో నిలుస్తోంది. గత రెండేళ్లుగా శాఖలో ఉద్యోగాల భర్తీలో ముడుపుల వ్యవహారం, అక్రమ డిప్యూటేషన్లు, నిబంధనలకు విరుద్ధంగా వాహనాల ఏర్పాటు, ఔట్ సోర్సింగ్ సిబ్బందికి అందలం ఎక్కించడంతో పాటు అనేక వివాదాలతో ఇప్పటికే తీవ్ర విమర్శల పాలవుతున్న వైద్యఆరోగ్యశాఖ అధికారులు తాజాగా మరో వివాదంతో తెరపైకి వచ్చారు. జిల్లాలోని ఆయా పీహెచ్‌సీలో పనిచేసే మెడికల్ ఆఫీసర్లు, సిబ్బందితో శాఖ ఉన్నతాధికారితో పాటు మరో సెకండ్‌క్యాడర్ అధికారి ఇష్టారీతిన వ్యవహరించడం, అసభ్యకరంగా మెసేజ్‌లు పంపించడంతో సదరు మెడికల్ ఆఫీసర్లు వేధింపులు భరించలేక కలెక్టర్, ఎస్పీలతో పాటు రాష్ట్ర ఉన్నతస్థాయి అధికారులకు ఫిర్యాదులు చేసే వరకు వ్యవహారం వెళ్లింది. దీంతో రాష్ట్రస్థాయి అధికారి జరిపిన వ్యవహారంపై బుధవారం పూర్తిస్థాయి విచారణ చేసేందుకు కామారెడ్డికి రానున్నారు. అయితే ఇప్పటికే అనేక ఆరోపణలు వచ్చిన వాటిలో కొన్నింటికి ఆధారాలు ఉన్నా ఏ ఒక్కరిపై చర్యలు లేకపోవడంతో ఈ వ్యవహారంలోనైన నిజం నిగ్గు తేలేనా.. నీరు గారేనా అనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

మహిళ ఉద్యోగినులతో అసభ్య ప్రవర్తన

వైద్య ఆరోగ్యశాఖలోని ఓ ఉన్నతాధికారితో పాటు మరో సెకండ్‌క్యాడర్ ఉన్నతాధికారి అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని ఏకంగా ఆయా పీహెచ్‌సీల మహిళ మెడికల్ ఆఫీసర్‌లతో పాటు మరికొంత మంది మహిళ ఉన్నతాధికారులు జిల్లాస్థాయి ఉన్నతాధికారులతో పాటు రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేశారు. శాఖ ఉన్నతాధికారి గత ఏడాదిన్నరగా పీహెచ్‌సీల తనిఖీలంటూ వచ్చి అసభ్యకరమైన సైగలు చేయడం, మాటలు మాట్లాడడం చేస్తున్నాడని, ఇటీవల ఓ శిక్షణ కార్యక్రమంలో మహిళలని చూడకుండా అసభ్య పదజాలం వినియోగించాడని, జిల్లా కార్యాలయానికి ఏదైన పని నిమిత్తం వస్తే వచ్చిన వెంటనే మరో సెకండ్‌క్యాడర్ అధికారి కార్యాలయంలోకి వచ్చి చెప్పుకోలేని విధంగా మాటలు మాట్లాడుతున్నారని మహిళ ఉద్యోగాలు ఆరోపిస్తున్నారు. సదరు సెకండ్ క్యాడర్ అధికారి అయితే ఏకంగా ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని ఓ మండల మెడికల్ ఆఫీసర్‌కు వాట్సాప్‌లో అసభ్యకరంగా మెసేజ్‌లు చేయడంతో, వేధింపులకు గురి చేయడంతో ఓపిక నశించి ఇద్దరు అధికారులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారనే వాదనలు వినిపిస్తున్నాయి. గత నాలుగైదు రోజుల కిందట పీహెచ్‌సీల వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసనలు తెలుపడం, జిల్లా కలెక్టర్‌కు, ఎస్పీకి ఫిర్యాదులు సైతం చేశారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీకి సైతం ఫిర్యాదు చేసేంతగా వ్యవహారం వెళ్లిందంటే ఏ స్థాయిలో మహిళ ఉద్యోగినులు మానసిక వేదనకు గురవుతున్నారో అర్థం చేసుకోవచ్చు.

వివాదాలు చుట్టుముడుతున్నా ఉదాసీనత ఎందుకో?

వైద్య ఆరోగ్యశాఖలో ఎన్నో సంవత్సరాల నుంచి వివాదాలు చుట్టుముడుతునే ఉన్నాయి. గత ఏడాదిన్నర క్రితం స్టాఫ్‌నర్సు, ఏఎన్ఎం పోస్టుల నియామకాల్లో లక్షలు తీసుకుని ఉద్యోగాల భర్తీ చేపట్టారని అప్పటి ప్రతిపక్ష నాయకులు ఆరోపించడంతో పాటు ఏకంగా ఓ ఉద్యోగి డబ్బులు తీసుకుంటున్న వీడియో ఆధారాలు సైతం అందించారు. ఆ విచారణ నత్తనడకన కొనసాగిందనే విమర్శలు వ్యక్తం అయ్యాయి. అదేవిధంగా ఓ ఉద్యోగి సంవత్సరం తరబడి విధులకు హాజరుకాకున్నా ఆమె సంతకాలను మరో ఉద్యోగి చేస్తుందని ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం డిప్యూటేషన్లను క్యాన్సల్ చేసి సిబ్బందిని సొంత ప్రాంతాల్లో పని చేసేలా చర్యలు తీసుకుంది. రోజుల వ్యవధిలోనే ముడుపులు ఇతర వ్యవహారాలు చూసే కొందరు సిబ్బంది తిరిగి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలోకి, ఆయా పీహెచ్‌సీలకు రావడం, ప్రభుత్వం విడుదల చేసే నిధులలో ఎంతో కొంత పీహెచ్‌సీ వారీగా డబ్బుల వసూళ్లు చేయడం లాంటి అనేక వివాదాలు ఉన్నాయి. కొన్నింట్లో ఆధారాలు ఉన్న ఉదాసీనత చూపడంతో ఇక తమను ఎవరు ఆపేదంటూ విచ్చలవిడితనంతో వ్యవహరించడం ఏకంగా ఉన్నతాధికారులకు తాము ముడుపులు అందిస్తున్నామని శాఖలోని కిందిస్థాయి సిబ్బందికి చెబుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసలు వివాదాలకు ఆదిలోనే చెక్‌పెట్టుంటే ఇంతలా శాఖ పరువు బజారున పడేది కాదని ఉదాసీనత చూపడంతోనే ఈ రకంగా జరుగుతుందనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

నేడు విచారణకు రానున్న రాష్ట్రస్థాయి అధికారి

మహిళ ఉద్యోగినులతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారనే ఫిర్యాదులు రాష్ట్ర శాఖ అధికారుల వద్దకు చేరడంతో విచారణకు ఆదేశించారు. దీంతో బుధవారం కామారెడ్డి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయానికి విచారణ అధికారిగా అడిషనల్ డైరెక్టర్ అమర్‌సింగ్ నాయక్ రానున్నారు. అయితే మహిళ ఉద్యోగులు వేధింపులపై ఫిర్యాదు చేస్తే సీనియర్ మహిళ ఉద్యోగినితో పాటు ఇద్దరికి తక్కువ కాకుండా విచారణ అధికారులు రావాల్సి ఉండగా ఒకరినే నియమించడంపై విచారణ పూర్తిస్థాయిలో జరుగుతుందా అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తమకు సరైన న్యాయం జరగకపోతే పెద్ద స్థాయిలో ఉద్యమించేందుకు సిద్ధమవుతామని మహిళ వైద్య సిబ్బంది నుంచి వినిపిస్తుండడం గమనార్హం.



ఐఎన్‌టీయూసీలో చేరిన నాయకులు

ఐఎన్‌టీయూసీ 327లో చేరిక

సుభాష్‌నగర్, మే 14: టీఆర్‌ఎస్‌కేవీ విద్యుత్ శాఖ నాయకులు భారీగా ఐఎన్‌టీయూసీ 327 యూనియన్‌లో చేరారు. జిల్లా కేంద్రంలోని పవర్‌హౌజ్ ప్రాంగణంలో ఐఎన్‌టియుసి 327 రాష్ట్ర జనరల్ సెక్రెటరీ శ్రీధర్ ఆధ్వర్యంలో ఐఎన్‌టీయూసీ 327 కండువా కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టిజన్ కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామని స్టాండింగ్ రూల్స్, సీటీడీ గ్యాంగ్ జీతాల వ్యత్యాసాలపై కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 100కు పైగా టీఆర్‌ఎస్‌కెవి యూనియన్ నాయకులు ఐఎన్‌టియుసిలో చేరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ ఐలేష్, జిల్లా కార్యదర్శి పూదారి గంగాధర్, వేణుగోపాల్‌రావు, పెంటయ్య, మనోహర్, మోహన్, శ్రీనివాస్, ముస్తక్, నాగేష్, కళ్యాణ్, ప్రభు, సతీష్ నర్సింలు, శ్యామ్, రాజేష్, భూమేష్‌లు పాల్గొన్నారు.

లక్షలు వెచ్చించి.. లక్షణంగా వదిలేశారు!

● ముళ్ల పొదలతో నిండిపోయిన మురుగుదొడ్లు ● యాచకులకు నిలయమంగా మారిన వేల్పూర్ ఆర్టీసీ బస్టాండ్

వేల్పూర్, మే 14: వేల్పూర్ మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ వినియోగంలో లేక నిరుపయోగంగా మారి యాచకులకు నిలయంగా మారింది. తెలుగు గ్రామీణ పథకం కింద టీడీపీ హయంలో అప్పటి సీఎం ఎన్‌టీరామారావు ప్రభుత్వ ప్రతీ మండలంలో ప్రయాణికుల సౌకర్యార్థం రూ.5లక్షల వ్యయంతో ఆర్టీసీ బస్టాండ్‌ను ఏర్పాటు చేశారు. బస్టాండ్ నిర్మించిన కొన్నాళ్ళకే ప్రయాణికులు దీనిని వినియోగించుకున్నారు. ఆ తర్వాత వేల్పూర్ మీదుగా భీమ్‌గల్‌కు వెళ్ళే బస్సులు బస్టాండ్‌లోకి రాకపోవడం, ఇక్కడ ఉన్న కంట్రోలర్ రాక పోవడంతో బస్టాండ్ ఆలనపాలన చూసేవారే కరువయ్యారు. దీంతో బస్టాండ్ ఆవరణలో మొక్కలు, ముళ్ళపొదలు పెరిగి అధ్వాన్నంగా తయారయ్యాయి. పగటి పూట పశువుల, పందులు, కుక్కలకు, మందు బాబులు, యాచకులకు నిలయంగా మారింది. అప్పట్లో గ్రామ మధ్యలో బస్టాండ్ ఏర్పాటు కోసం సరిపోడ స్థలం లేకపోవడంతో గ్రామానికి చివరిలో బస్టాండ్‌ను నిర్మించడం వల్లనే బస్టాండ్ నిరుపయోగంగా మారిందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. కాగా ప్రస్తుతం బస్టాండ్‌ను దాటి వేసి బస్టాండ్ సమీపంలో ప్రభుత్వ వివిధ శాఖల కార్యాలయాల భవనాలు కొనసాగుతున్నాయి. భవనాలు నిర్మించడం జరిగిందని, కమర్షల్ షాపింగ్, దుకాణాలు కూడా వెలిశాయని, మండల గ్రామాలకు సంబంధించిన ప్రజలు ప్రతీరోజు పనిపై ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్తుంటారు. ఈ ప్రస్తుత పరిస్థితుల్లో బస్టాండ్‌కు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. ప్రస్తుతం బస్టాండ్ భవనాలకు సంబంధించి కిటికీలు, తలుపులను దొంగలు ఎత్తుకెళ్ళాలరని, మరుగుదొడ్లు అనవాళ్లు కోల్పోయి ముళ్ళపొదల్లో నిండిపోయాయి ఇప్పటికైనా బస్టాండ్ లోపలికి బస్సులు వచ్చే విధంగా ప్రజలకు సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

● ఆర్టీసీ బస్టాండ్‌ను వినియోగంలోకి తేవాలి

: బద్దం రాజారెడ్డి, స్థానికుడు, వేల్పూర్



నిరుపయోగంగా మారిని బస్టాండ్‌కు మరమ్మత్తులు చేపట్టి వినియోగం తీసుకురావల్సిన అవసరం సంబంధిత అధికారులపై ఉంది. బస్టాండ్‌కు దగ్గరలో వివిధ శాఖల ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు బస్టాండ్‌ను వినియోగం తీసుకురావాలి. వేల్పూర్ మీదుగా భీమ్‌గల్‌కు వెళ్ళే బస్సుల సంఖ్య పెంచుతూ ప్రయాణికులకు సౌకర్యం కల్పించాలి.



యాచకులకు నిలయంగా మారిన వేల్పూర్ ఆర్టీసీ బస్టాండ్



బస్టాండ్‌లో ముళ్లపొదలతో నిండిపోయిన మరుగుదొడ్లు

లాఠీచార్జ్‌పై ఉపాధ్యాయ సంఘాల ఖండన

నిజామాబాద్ అర్బన్, మే 14: నిబంధనల ప్రకారం టీఏ, డీఏ చెల్లించాలని అడిగినందుకు పోలీసుల బలప్రయోగాన్ని ఉపాధ్యాయులపై చేయడం దారుణమని ఉపాధ్యాయ సంఘాలు ఖండించాయి. ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు నిబంధనల ప్రకారం రెమ్యూనరేషన్ చెల్లించాలని అడిగినందుకు పోలీసులతో లాఠీచార్జి చేయించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ మేరకు టీఎస్‌యుటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సత్యానంద్, రమేష్‌లు ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధ్యాయులపై లాఠీచార్జి చేయించిన నారాయణకేడ్ ఆర్‌డీవోపై చర్యలు తీసుకోవాలన్నారు. అంతేకాకుండా ఎన్నికల విధులు నిర్వహించిన పలువురు ఉపాధ్యాయులపై లాఠీచార్జి చేయడం దారుణమని, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెనిగళ్ల సురేష్, సల్ల సత్యనారాయణలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యాయంగా తమకు రావాల్సిన వేతన భత్యాలను ఇవ్వాలని అడిగిన వారిపై పోలీసులు లాఠీచార్జి చేయడం సరికాదని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని అధికారులపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

కోటగల్లిలో భర్త ఇంటి ముందు భార్య ఆందోళన

నిజామాబాద్ అర్బన్, మే 14: కట్టుకున్న భర్త తనను మోసం చేశాడని ఆరోపిస్తూ భార్య ఆయన ఇంటి ముందు ఆందోళనకు దిగింది. మంగళవారం నగరంలోని కోటగల్లి ప్రాంతానికి చెందిన సిరిపురం మనస్విని 2016లో శ్రీనివాస్ అనే వ్యక్తిని పెళ్లి చేసుకోగా అత్తగారికి సంబంధించిన ఇంటిని బహుమతిగా ఇచ్చారని అదే ఇంట్లో గత కొన్నేళ్లుగా నివాసం ఉంటున్నానని కానీ తన భర్త శ్రీనివాస్‌కు మొదటి భార్య సవిత తన ఇంటిని స్వాధీనం చేసుకునేందుకు భర్తతో కలిసి వేధింపులకు పాల్పడుతుందని తనకు న్యాయం చేయాలని కోరింది. మహిళా సంఘాల ప్రతినిధులతో కలిసి ఆమె భర్త శ్రీనివాస్ ఇంటి ఎదుట ఆందోళన చేసింది. ఇదే విషయమై సవిత నివాసం ఉండే బొంబాయికి వెళ్లి ఫిర్యాదు చేశానని దీనిని సుమోటోగా స్వీకరించి జిల్లా కోర్టు, నాల్గవ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసానని మనస్విని తెలిపింది. అంతేకాకుండా ఇదే విషయమై సవిత ఆమె అనుచరులు గత శనివారం మధ్యాహ్నం తన ఇంటిపై దాడి చేసి అకారణంగా దాడికి దిగారని ఆమె ఈ సందర్భంగా వాపోయింది. అంతేకాకుండా ఈ దాడి వెనక తన భర్త శ్రీనివాస్ కుట్ర ఉందని కావున తనకు న్యాయం చేయాలని ఆమె కోరింది.

నేడు రూరల్ మండల సమావేశం

నిజామాబాద్ రూరల్, మే, 14: నిజామాబాద్ రూరల్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 15న జరగనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో మదురిమ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా బుధవారం ఉదయం 11 గంటలకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో మదురిమ తెలిపారు. సమావేశానికి ప్రత్యేక అధికారులతో పాటు మండల అధికారులు, ఎంపీటీసీలు సకాలంలో హాజరుకావాలని కోరారు.

'సహకరించిన ప్రజలకు ధన్యవాదాలు'

నిజామాబాద్ అర్బన్, మే 14: లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడంలో సహకరించిన ప్రజలు, సిబ్బందికి సీపీ కల్మేశ్వర్ సింగెనవార్ మంగళవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు. దీనిలో భాగంగా పార్లమెంట్ పరిధిలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడంలో సహకరించిన ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

తూనికలు కొలతల అధికారుల దాడులు

ధర్పల్లి, మే 14: తూనికల కొలతల అధికారులు మంగళవారం మండల కేంద్రంలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో గల వ్యాపార సంస్థలు, మార్కెట్‌లలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రిన్యూవల్ చేసుకోలేని వారిని గుర్తించారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ తూనికల కొలతల అధికారుల ఆదేశాలను తప్పకుండా పాటించాలని, లేనిపక్షంలో జరిమానాలు ఉంటాయన్నారు. దాడులు కొనసాగుతాయని వారు తెలిపారు.

ట్రాక్టర్‌పై నుంచి పడి వ్యక్తి మృతి

మోపాల్, మే 14: మోపాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కంజర్ గ్రామ సమీపంలో సోమవారం అర్ధరాత్రి ట్రాక్టర్ నడుపుతున్న మెట్టు అశోక్(30) కిందపడి మృతి చెందాడు. అశోక్ ట్రాక్టర్ నడుపుతుండగా ఫిడ్స్ రావడంతో కిందపడటంతో అతనిపై ట్రాక్టర్ వెళ్లగా అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



ఇందల్వాయి పోలీస్ స్టేషన్‌లో పెళ్లి చేసుకున్న ప్రేమికులు

పోలీస్ స్టేషన్‌లో ప్రేమపెళ్లి

ఇందల్వాయి, మే 14: ఇందల్వాయి పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఓ ప్రేమపెళ్లి జరిగింది. ఇందల్వాయికి చెందిన నిఖిల్ అనే యువకుడు సిరికొండ మండలంలోని ఓ గ్రామానికి చెందిన హారిని అనే అమ్మాయితో గత కొన్ని రోజులుగా ప్రేమలో ఉన్నాడు. వారు ఇరువురు మేజర్లు కావడంతో ఓ ఆలయంలో పెళ్లి చేసుకున్నారు. ఆ తర్వాత పోలీస్ స్టేషన్‌కు విషయం తెలిపారు. కాగా, పోలీస్ స్టేషన్‌లో అబ్బాయి తరపు బంధువుల సమక్షంలో దండలు మార్చుకొని పెళ్లి చేసుకున్నారు. ఇందల్వాయి ఎస్సై మనోజ్‌కుమార్ వారికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ సీఐ స్టీవెన్‌సన్

కల్లు విక్రయదారుడి అరెస్టు

● 5.22లీటర్ల లిక్కర్‌తో పాటు బైక్ స్వాధీనం

ఆర్మూర్ టౌన్, మే 14: మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో సోమవారం రాత్రి కల్లు విక్రయదారుని అరెస్టు చేసినట్టు ఎక్సైజ్ సీఐ స్టీవెన్‌సన్ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా అక్రమంగా లిక్కర్ విక్రయం చేస్తున్న సమాచారం మేరకు దాడి చేయడంతో విక్రయదారుని వద్ద 5.22లీటర్ల లిక్కర్‌తో పాటు హీరో గ్లామర్ బైక్‌ను పట్టుకొని నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు.

ఫంక్షన్ హాళ్లపై పట్టింపేది..?

● కనిపించని సీసీ కెమెరాలు ● ఒకే రోజు రెండు పెళ్లిళ్లు ● ఫంక్షన్ హాళ్లలో ఫైర్ సెఫ్టీ పరికరాలు కరువు ● శానిటేషన్ విభాగానికి అదనపు భారం ● నిబంధనలు పాటించని యాజమానులు ● నిజామాబాద్ జిల్లాలో పట్టించుకోని సంబంధిత శాఖల అధికారులు



బోధన్ రూరల్, మే 14: బోధన్ డివిజన్‌తో పాటు జిల్లాలోని ఫంక్షన్ హాళ్లలో సంబంధిత అధికారుల నిఘా కరువైంది. నిత్యం పెళ్లిళ్లు, పుట్టిన రోజు ఇతరత్రా వేడుకలు నిర్వహించుకునే ఫంక్షన్ హాళ్లలో సీసీ కెమెరాలు లేకపోవడం, శుభకార్యాలయాలకు వచ్చే వారికి ఇబ్బందులకు గురి చేస్తుంది. సీసీ కెమెరాలు లేకపోవడం సందట్లో సడేమియా అంటూ దొంగలకు కలిసి వస్తుంది. పెళ్లిళ్ల, ఇతర శుభకార్యాల సందర్భంగా వందల సంఖ్యలో గుమిగూడి ఉండే ఫంక్షన్ హాళ్లలో సీసీ కెమెరాలు లేకపోవడం గమనార్హం. ఫంక్షన్ హాల్‌లో సీసీ కెమెరాల ఏర్పాట్లపై అటు పోలీసులు, ఇటు అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయం.



బోధన్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్

● **నిఘాతో అడ్డుకట్ట**

సీసీ కెమెరాలు ఉంటే శుభకార్యాలు చేసుకునే వారికి అన్ని విధాలుగా సౌకర్యంగా ఉంటుంది. ఫంక్షన్ హాళ్లకు వచ్చే మహిళల బంగారు ఆభరణాల చోరీ ఘటనలు జరిగే అవకాశాలు ఉండవు.

● **ఫైర్‌సెఫ్టీ అనుమతులు కరువు**

ఫంక్షన్ హాల్ నిర్మాణాలకు గ్రామీణ ప్రాంతాలలో జిల్లా పంచాయతీ అధికారి, మున్సిపల్ పరిధిలో కమిషనర్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. వీరితో పాటు అగ్నిమాపక శాఖ నుండి తప్పనిసరిగా ఫైర్‌సెఫ్టీ అనుమతి ఉండాలి. ఫంక్షన్ హాల్ నిర్మాణ సమయంలో ముందస్తుగా ప్రొవిజినల్ ఎన్‌వోసీ తీసుకోవాల్సి ఉంటుంది. నిర్మాణం పూర్తయిన తర్వాత ఒరిజినల్ ఫైర్‌సెఫ్టీ అనుమతి తీసుకోవాలి. ఫంక్షన్ హాల్స్‌లో అగ్నిమాపక నియంత్రణ పరికరాలు అందుబాటులో ఉంచితేనే ఫైర్‌సెఫ్టీ అనుమతి ఇస్తారు. కాని జిల్లాలో సుమారు 50వరకు ఫంక్షన్ హాళ్లు ఉండగా కేవలం కొన్నింటికి మాత్రమే ప్రొవిజినల్ ఎన్‌వోసీ ఉన్నట్లు అధికారులు తెలుపుతున్నారు. ఐదేళ్లకు ముందు నిర్మించిన వాటికి అనుమతులు లేవని ఐదేళ్ల నుంచే ఈ అనుమతులు తీసుకుంటున్నారని అధికారులు పేర్కొంటున్నారు. శుభకార్యాలు జరిగినప్పుడు భోజన విస్తరాకులు, ఇతర వ్యర్థాలు మున్సిపల్ శానిటేషన్ విభాగానికి తీసుకెళ్లడం అదనపు భారంగా మారింది. నిత్యం పెళ్లిళ్ల సీజన్‌లో రెండు పెళ్లిళ్లు జరిగే సరికి ఫంక్షన్ హాల్‌లోని చెత్తచెదారం తీసుకెళ్లడం వారికి చాలా భారంగా మారింది.

● **పర్యావరణాన్ని పరిరక్షించాలి..**

: వెంకట్ నారాయణ, మున్సిపల్ కమిషనర్, బోధన్



ఫంక్షన్ హాల్‌లో పర్యావరణాన్ని పరిరక్షించడానికి యజమాన్యాలు కృషి చేయాలన్నారు. ప్లాస్టిక్‌లను వాడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. లేని యెడల కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపడతామన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న 2012 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

ఏర్గట్లలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఏర్గట్ల, మే 14: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన 2011-2012 బ్యాచ్ పూర్వ విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. అందులో భాగంగా తమతో పాటు చదివిన తోటి విద్యార్థులు ఒకరినొకరు కలుసుకొని తమతో గడిపిన పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకొని తమకు విద్యావంతులు చేసిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో 2011-2012 బ్యాచ్ పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

ఆర్మూర్ రూరల్, మే 14: ఈనెల 15వ తేదీన ఆర్మూర్ మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సాయిరాం మంళవారం ఒక తెలిపారు. బుధవారం ఉదయం 11గంటలకు ఎంపీపీ పస్క నర్సయ్య అధ్యక్షతన జరిగే సర్వసభ్య సమావేశానికి ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

డిచ్‌పల్లిలో..

డిచ్‌పల్లి: డిచ్‌పల్లి మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నేడు ఉదయం 11గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో జరగనుందని, ఎంపీడీవో రవీందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ సభ్యులు , మండల స్థాయి అధికారులు సకాలంలో హాజరుకావలని అధికారులు ప్రగతి నివేదికలు వెంట తీసుకురావలన్నారు. ఈ కార్యక్రమానికి అన్ని విభాగాల అధికారులు హాజరుకావలని కోరారు.

సమ్మర్ క్యాంపునకు క్రీడాకారుల ఎంపిక

ముప్కాల్, మే 14: ఈనెల 16 ఉదయం 10గంటలకు ముప్కాల్ చైతన్య యువజన సంఘం మైదానంలో అండర్-16, అండర్-20 బాలుర విభాగం ఎంపిక చేయనున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు అంద్యాల లింగయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ఎంపికైన క్రీడాకారులకు ఈనెల 18నుంచి జున్ 1వ తేదీ వరకు సమ్మర్ స్పెషల్ శిక్షణ తరగతులు నిర్వహించనున్నామన్నారు. జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మరిన్ని వివరాలకు 9989814410నెంబర్‌లో సంప్రదించాలన్నారు.



స్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తున్న క్షత్రీయ సమాజ్ సభ్యులు

ఘనంగా లక్ష్మీనారాయణుడి కల్యాణం

ఆర్మూర్ టౌన్, మే 14: పట్టణంలోని కిందిబజార్ లక్ష్మీనారాయణ మందిరంలో మంగళవారం లక్ష్మీనారాయణస్వామి కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు స్వామివారికి పూజలు, యజ్ఞం నిర్వహించి మంగళవాయిద్యాలతో పల్లకి సేవను నిర్వహించారు. లక్ష్మీనారాయణస్వామివారి కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ క్షత్రీయ సమాజ్ అధ్యక్షుడు అజారి మదన్‌మోహన్, కార్యదర్శి బారడ్ గంగామోహన్, రమాదేవి, ఖాందేశ్ సంగీత శ్రీనివాస్, వైద్యసంజయ్, గటడి కిషన్, డికె.శ్రీనివాస్, అజరీ రమేష్, రాజేందర్, విజయ్, రవీందర్, దినేష్, సంతోష్, నీరజ్, తదితరులు పాల్గొన్నారు.

● **గ్రామాలయంలో లక్ష్మీనరసింహస్వామి జయంతి ఉత్సవాలు**

భీమ్‌గల్ రూరల్: భీమ్‌గల్ పట్టణంలోని గ్రామాలయంలో శ్రీ లక్ష్మీ నరసింహస్వామి జయంతి ఉత్సవాలు కన్నుల పండువగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను చంద్రవాహనంపై ఊరేగించారు. ఉదయం స్వామివారి ఆలయంలో దీపారాధన, స్వస్తి పుణ్యాహవచనం, మాతృక, మంటక దేవతాస్థాపన నిర్వహించారు. సాయంత్రం ఆరుగంటలకు ప్రత్యేకంగా అలంకరించిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవ విగ్రహాలను అందంగా అలంకరించిన బంగారు ఆభరణాలతో దేదీప్యమానంగా వెలిగిపోతున్న విగ్రహాలను ఊరేగించారు. గ్రామాలయం మొత్తం గోవిందనామస్మరణలతో మార్మోగింది. ఉత్సవాలను ఆలయ అర్చకులు నంబిపార్థసారధి ఆధ్వర్యంలో కొనసాగిస్తున్నారు.



చంద్ర వాహనంపై ఊరేగుతున్న స్వామివారు

కన్నులపండువగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

● హాజరైన హంపి పీఠాధిపతి విరూపాక్ష విద్యారణ్య భారతి స్వామి ● వేకువజాము నుంచే ఆలయంలో ప్రత్యేక పూజలు

డిచ్‌పల్లి, మే 14: మండలంలోని ధర్మారం(బి) గ్రామంలో వెలసిన శ్రీదేవిభూదేవి సహిత వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం స్వామివారి కల్యాణోత్సవం కన్నులపండువగా సాగింది. వేంకటేశ్వర స్వామి ఆలయంలో ద్వాదశ వార్షికోత్సవం పురష్కరించుకొని ఐదు రోజుల పాటు ఆలయ నిర్వాహకులు వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఈ కల్యాణ మహోత్సవం, మహాకుంభాభిషేక కార్యక్రమాలను హంపి పీఠాధిపతి విద్యారణ్యభారతి మహాస్వామి చేతుల మీదుగా నిర్వహింపజేశారు. ఈ సందర్భంగా 108 కలశాలతో పూజ ప్రత్యేకంగా నిర్వహించారు. ఐదు రోజుల పాటు నిర్వహించిన ఈ వేడుకలకు భక్తులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. కాగా, మంగళవారం ఆలయ ప్రాంగణంలో కుంభాభిషేకం, బలిహరణం, విగ్రహాల ఊరేగింపు, కన్నుల పండుగగా సాగింది. బ్రహ్మశ్రీ ఏలేటి పుశుపతి శర్మ, ఉమామహేశ్వర శర్మ, రాహుల్ త్రిపాటిలు స్వామివారి వేడుకలను అత్యంత వైభోపేతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ రావుల బ్రహ్మానందం, పొసరాజు నాగర్జున, నాయుడు ఆంజనేయులు, రవి బాబు, నాగేశ్వరరావు, లక్ష్మీనారాయణ, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



ధర్మారం(బి)లో శ్రీదేవి, భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేద బ్రాహ్మణులు



పూజలు చేస్తున్న హంపీ విరూపాక్ష విద్యారణ్యభారతి స్వామి



చిన్నారుల సాంస్కృతిక ప్రదర్శనలు



హాజరైన భక్తులు

బాలికల హాస్టల్ నిర్మాణం ఎప్పుడో?

● తెలంగాణ యూనివర్సిటీలో బాలికలకు కరువైన వసతులు ● ఇరుకుగా మారిన హాస్టల్ గదులు ● ఒకే భవనంలో 500 మందికి వసతి ● 300మందికి సరేపోయే భవనంలో 500 మంది విద్యార్థులకు వసతి ● తీవ్ర ఇబ్బందులు పడుతున్న విద్యార్థినులు ● సమస్యకు సత్వరమే పరిష్కారం చూపాలంటూ విజ్ఞప్తి

డిచ్‌పల్లి, మే 14: రాష్ట్ర అవతరనకు ముందే ప్రత్యేక తెలం గాణ రాష్ట్రం పేరుతో ఉన్న ఏకైక యూనివర్సిటీ ఈ డిచ్‌పల్లి తెలం గాణ యూనివర్సిటీ. ఇంత ఘనమైన పేరున్న ఈ విశ్వవిద్యాల యంలో బాలికలకు తీవ్రమైన వసతి ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. రాష్ట్రం అవతరించి 10ఏళ్లు గడిచిన వర్సిటీలో బాలికల వసతి సమస్య నేటికి తీరాడం లేదు ఏన్నో సార్లు ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు, రాష్ట్ర గవర్నర్‌కు వినతి పత్రాలు విద్యార్థులు అందించిన సమస్య పరిష్కరం కావడం లేదు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి విద్యార్థినులు ఇక్కడికి పీజీ, ఉన్నత చదువుల కోసం వస్తుంటారు. గత 5సంవత్సరాల కాలంగా ఈ హస్టల్ సమస్య తీవ్రంగా వేధిస్తున్న ప్రభుత్వ, పెద్దలు, ఉన్నత విద్యామండలి స్పందించకపోవడంతో విద్యార్థినులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. పీజీ కోర్సుల్లో అన్ని విభాగాల్లో విద్యార్థినులే అధిక శాతం సీట్లు 100శాతం సీట్లలో 72మంది విద్యార్థినులే సీట్లు సాధిస్తున్నారు. దీంతో వర్సిటీలోని బాలికల హస్టల్ లోని ఒక్కో గదిలో 5నుంచి 6గురు ఉండాల్సి ఉండగా.. 10 నుంచి 15మంది సర్దుబాటు చేసుకుంటున్నారు. తెలంగాణ యూనివర్సిటీలో 1851మంది విద్యార్థులు పీజీ కోర్సుల్లో చేరగా 1226మంది బాలకలు పీజీ కోర్సులో ప్రవేశం పొందారు. గతంలో ఏన్నడు లేని విధంగా పీజీ కోర్సుల్లో బాలికలు ఎక్కువగా చేరుతుండటంతో హస్టల్ అకామిడేషన్ ఇబ్బందిగా మారుతుంది. దీంతో యూనివర్సిటీ అధికారులు సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులో చేరే విద్యార్థులకు హస్టల్ వసతి కల్పించకుండా ఒత్తిడిని తగ్గించే ప్రయ త్నం చేస్తున్నారు. గత పదేళ్ల క్రితం 300 మంది కోసం నిర్మించిన బాలికల హస్టల్ లో ప్రస్తుతం 500 మంది ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కెమిస్ట్రీ, తెలుగు, ఇతర డిపార్టు మెంట్‌లలో 30 నుంచి 60 సీట్లకు పెంచిన హస్టల్ వసతి మాత్రం పెంచడం లేదని దీంతో సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని విద్యార్థినులు వాపోతున్నారు.

● **ఏడాది గడిచినా నెరవేరని గవర్నర్ హామీ?**

గతంలో విశ్వవిద్యాలయానికి రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ సందర్శించి సమయంలో విద్యార్థులు బాలికల హస్టల్ ఏర్పాటు చేయాలని ఆమెకు తమ గోడు వెళ్లబోసుకున్నారు. వెంటనే సమస్య పరిష్కరించేందుకు స్వయంగా హస్టల్ సందర్శించిన గవర్నర్ హామీ ఇచ్చి ఏడాది కాలం గడిచిన ఇంత వరకు హస్టల్ వసతి నిర్మాణానికి చిల్లిగవ్వ కూడా మంజూరు కాకపోవడంతో విద్యార్థినులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. జిల్లా శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులు వసతి గృహం ఏర్పాటు పట్ల ప్రత్యేక చొరవ చూపాలని విద్యార్థినులు కోరుతున్నారు.



తెలంగాణ యూనివర్సిటీ కళాశాల భవనం



యూనివర్సిటీ స్వాగత తోరణం



విశ్వవిద్యాలయంలోని బాలికల హాస్టల్ ఇదే..

'ఉపాధ్యాయులపై లాఠీచార్జి చేయించిన అధికారులపై చర్యలు తీసుకోవాలి'

కామారెడ్డి టౌన్, మే 14: ఎన్నికల విధులు నిర్వహించిన ఉపాధ్యాయులపై లాఠీచార్జి చేయించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, అనిల్‌కుమార్‌లు డిమాండ్ చేశారు. నారాయణఖేడ్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికల విధులు నిర్వహించిన ఉపాధ్యాయులు తమకు రావాల్సిన 5 రోజుల భత్యం రాష్ట్రవ్యాప్తంగా ఏకరీతిగా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నందుకు అమానుషంగా పోలీసులతో లాఠీచార్జి చేయించారని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో సిబ్బందికి ఇవ్వాల్సిన రెమ్యునరేషన్‌పై ప్రభుత్వం పీఓ, ఏపీఓలకు 3150, ఓపీఓలకు 1750 ఇవ్వాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ కొన్ని జిల్లాల్లో మాత్రం ఆ ఆదేశాలను భేఖాతారు చేస్తు సిబ్బందికి డబ్బులను తక్కువ ఇచ్చారని తెలిపారు. తక్కువగా చెల్లించిన నియోజకవర్గాల్లో రెమ్యునరేషన్ వెంటనే చెల్లించాలని పేర్కొన్నారు.



బీర్కూర్ పీహెచ్‌సీలో మహిళలకు వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

48 మంది మహిళలకు ఆరోగ్య పరీక్షలు

బీర్కూర్, మే 14: బీర్కూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం 48 మంది మహిళలకు వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. గర్భం, క్యాన్సర్, బీపీ, షుగర్, మూత్ర, థైరాయిడ్ తదితర పరీక్షలు చేసినట్లు డాక్టర్ గిరీష్‌కుమార్ తెలిపారు. వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడే వారికి వివిధ ఆసుపత్రులకు రిఫర్ చేశారు. 30ఏళ్లు దాటిన మహిళలు అందరూ తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు.



అచ్చంపేటలో బోనాలను తీసుకెళుతున్న దృశ్యం

అందరిని చల్లంగా చూడు ఎల్లమ్మ తల్లి

నిజాంసాగర్, మే 14: అందరిని చల్లంగా చూడు ఎల్లమ్మ తల్లి అంటూ మంగళవారం మండలంలోని అచ్చంపేటలో భక్తులు ఎల్లమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. భక్తి శ్రద్ధలతో అమ్మవారికి బోనాలను సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడి పంటలు పుష్కలంగా పండాలని, అందరూ సుఖ సంతోషాలతో ఉండేలా దీవించాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.

బాన్సువాడలో వృద్ధుడి శవం లభ్యం



బాన్సువాడ, మే 14: బాన్సువాడ పట్టణంలోని షేక్ చాంద్ హోటల్ వద్ద సోమవారం సాయంత్రం గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యమైనట్లు పట్టణ సీఐ కృష్ణ తెలిపారు. మృతదేహాన్ని బాన్సువాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలోని మార్చురీ గదిలో ఉంచినట్లు ఆయన తెలిపారు. మృత దేహానికి సంబంధించిన వారు గుర్తు పట్టినట్లయితే పట్టణ సీఐ సెల్ నెంబర్ 8712686167, ఎస్సై 8008809152 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని సీఐ కృష్ణ తెలిపారు.



అమ్మవారి కల్యాణాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

కన్నుల పండువగా రేణుకా జమదగ్నిల కల్యాణం

భిక్కనూరు, మే 14: మండలంలోని జంగంపల్లి గ్రామంలో గల రేణుకా ఎల్లమ్మ ఆలయ రెండవ వార్షికోత్సవ కార్యక్రమాన్ని గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, గౌరి గణపతి పూజ, పుణ్యావాచనం, నవగ్రహపూజ, కుంకుమపూజ, అభిషేకాలు, యజ్ఞం, తదితర కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం వేదబ్రాహ్మణుల మంత్రోచ్చరణల నడుమ ఆలయ ప్రాంగణంలో రేణుకా ఎల్లమ్మ-జమదగ్నిల కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. అనంతరం అమ్మవారికి మహిళలు ఓడి బియ్యం పోసి మొక్కులు చెల్లించుకున్నారు. కాగా ఆలయ ప్రాంగణంలో గౌడసంఘం ప్రతినిధులు పెద్దఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం ప్రతినిధులు, భక్తులు, గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కూలేందుకు సిద్ధంగా ఉన్న నాగిరెడ్డిపేట ఆర్టీసీ బస్టాండ్

- బస్టాండ్ పై కప్పు పెచ్చులూడుతున్నా పట్టించుకోని ఆర్టీసీ అధికారులు
- బస్టాండ్‌లో ప్రయాణికులకు తాగునీరు కరువు

నాగిరెడ్డిపేట, మే 14: ఆర్టీసీ సంస్థ ప్రయాణికులకు బస్టాండ్‌లలో కనీస సౌకర్యాలు కల్పించడంలో పూర్తిగా విఫలమవుతుందని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. గత 31 సంవత్సరాల క్రితం నిర్మించిన నాగిరెడ్డిపేట మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో రానున్న వర్షాకాలంలో భారీ వర్షాలకు ఎప్పుడు కూలిపోతుందోనని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రయాణికులకు కనీస సౌకర్యాలు కరువై నిత్యం అవస్థలు పడుతున్నారు. బస్టాండ్ శిథిలావస్థకు చేరి పై కప్పు పెచ్చులూడిపోతుండటంతో బస్టాండ్‌లోనికి వెళ్లాలంటే జంకుతున్నారు. బస్టాండ్‌లోకి వెళితే ఎక్కడ పైకప్పు పెచ్చులూడి తమపైన పడతాయోనని భయాందోళన చెందుతున్నారు. ఈ బస్టాండ్ మరమ్మతు గురించి గాని, బస్టాండ్‌లో కనీస సౌకర్యం కల్పించడంలో గాని ఆర్టీసీ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని మండల ప్రజలు, ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో తెలుగు గ్రామీణ క్రాంతి పథకం కింద 1992లో ఈ బస్టాండ్‌ను నిర్మించారు. బస్టాండ్ నిర్మాణమై 31 సంవత్సరాలు అవుతున్నందున బస్టాండ్ పూర్తిగా శిథిలావస్థకు చేరింది. బస్టాండ్‌లో కూర్చునేందుకు ఒక్క బెంచీని కూడా ఏర్పాటు చేయలేదు. గతంలో ప్రయాణికులు బస్టాండ్‌లోని దిమ్మెలపై కూర్చునేవారు. దిమ్మెలు కూలిపోవడంతో ప్రస్తుతం చెట్ల కిందనే గంటల తరబడి నిలబడి బస్సుల కోసం నిరీక్షిస్తూ ఉంటారు. ఈ బస్టాండ్‌లో కనీసం తాగునీటి సౌకర్యం కూడా లేదు. బస్టాండ్‌లోని బోరు మోటారు చెడిపోయి సంవత్సరాలు గడుస్తున్నా మరమ్మతులు చేయకపోవడంతో బస్టాండ్‌లో తాగునీటికి కటకట ఏర్పడింది. దీంతో హోటళ్లనే ఆశ్రయించాల్సిన దుస్థితి ఉందని వాపోతున్నారు. బస్టాండ్ ఆవరణలో నుంచి మురికి కాలువ ప్రవహిస్తూ ఉండటంతో దుర్గంధం వస్తుందని, బస్టాండ్‌లో విద్యుత్ సౌకర్యం లేక రాత్రి వేళ చీకటిమయంగా ఉంటుందని అంటున్నారు. ఈ బస్టాండ్ బాన్సువాడ ఆర్టీసీ డిపో పరిధిలోకి వస్తోంది. బాన్సువాడ డిపో మేనేజర్ గాని, ఆర్టీసీ ఉన్నతాధికారులు గాని ఈ బస్టాండ్ గురించి పట్టించుకోవడం లేదంటూ తీవ్రంగా విమర్శిస్తున్నారు.ఈ బస్టాండ్ గుండా నిత్యం వివిధ ప్రాంతాలకు అనేక మంది ప్రయాణికులు ప్రయాణిస్తుంటారు. కామారెడ్డి - మెదక్ జిల్లాల సరిహద్దులో ఉన్న ఈ నాగిరెడ్డి పేట బస్టాండ్ మరమ్మతుల గురించి గాని, దీని అభివృద్ధి గురించి గాని, బస్టాండ్‌లో కనీస సౌకర్యాలు కల్పించడంలో గాని ఆర్టీసీ అధికారులు ఏ మాత్రం చర్యలు చేపట్టడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ రీజినల్ మేనేజర్ తగు చర్యలు తీసుకుని నాగిరెడ్డిపేట బస్టాండ్ శిథిలమైనందున నూతన బస్టాండ్‌ను మంజూరు చేయాలని లేదా వెంటనే మరమ్మతులైనా చేపట్టాలని మండల ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

బస్టాండ్‌లోకి వెళ్లని బస్సులు

నాగిరెడ్డిపేట బస్టాండ్‌లోకి బస్సులు వెళ్లడం లేదు. ఆర్టీసీ బస్సు డ్రైవర్లు రోడ్డుపైనే బస్సులను ఆపుతుండటంతో ప్రయాణికులు రోడ్డుపైనే బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు. బస్టాండ్ శిథిలావస్థలో ఉన్నందున కనీస సౌకర్యాలు లేకపోవడంతో ప్రయాణికులు బస్టాండ్‌లోకి వెళ్లడం లేదు. చెట్ల కింద, రోడ్డుపైనే గంటల తరబడి నిలబడి బస్సుల కోసం నిరీక్షిస్తుండటంతో, బస్సు డ్రైవర్లు బస్సులను రోడ్డుపైనే ఆపుతున్నారు.

ఎమ్మెల్యే హామీ నెరవేరేనా?

నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో, తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే మండల కేంద్రంలో నూతన బస్టాండ్‌ను మంజూరు చేయించి నిర్మిస్తానని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు అసెంబ్లీ ఎన్నికల్లో నాగిరెడ్డిపేటలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన హామీ ఇచ్చారు. మదన్ మోహన్‌రావు ఎమ్మెల్యేగా గెలుపొందినందున ఎమ్మెల్యే ఎన్నికల్లో ఇచ్చిన హామీని ఎప్పటికీ నెరవేరుస్తారోనని మండల ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఎమ్మెల్యే వెంటనే తగు చర్యలు తీసుకుని నాగిరెడ్డిపేటకు నూతన బస్టాండ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి తన హామీని నిలబెట్టుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.



శిథిలావస్థలో ఉన్న నాగిరెడ్డిపేట బస్టాండ్ ఇదే..



బస్టాండ్‌పై కప్పు పెచ్చులూడిన దృశ్యం



వృథాగా ఉన్న మంచి నీటి నల్లా

జహీరాబాద్ గెలుపు ఎవరిదో?

మద్నూర్, మే 14: పార్లమెంట్ ఎన్నికల సమరం ముగియడంతో జహీరాబాద్ పార్లమెంట్‌లో గెలుపు ఎవరిది అనే చర్చ కొనసాగుతోంది. అభ్యర్థుల రాజకీయ భవిష్యత్తు ఈవీఎంలలో నిక్షిప్తమైంది. ఫలితం జూన్ 4వ తేదీకి తేలనుంది. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో 71.91 శాతం పోలింగ్ నమోదు కావడంతో జహీరాబాద్‌లో గెలుపు ఎవరిది అనే చర్చ కొనసాగుతోంది. జహీరాబాద్ పరిధిలోని జుక్కల్ నియోజకవర్గంలో 71.91 శాతం, బాన్సువాడలో 73.99 శాతం, ఎల్లారెడ్డిలో 74.74 శాతం, కామారెడ్డిలో 64.70 శాతం, నారాయణ ఖేడ్‌లో 70.83 శాతం, అంధోల్ 73.68 శాతం, జహీరాబాద్ 74.50 శాతం పోలింగ్ నమోదు జరిగినట్లు అధికారులు వెల్లడించారు. 21 రోజుల పాటు అభ్యర్థులు పార్టీల నాయకులు, మద్దతుదారుల్లో నరాలు తెగే ఉత్కంఠ ఉండగా, తాను ఓటు వేసిన నాయకుడు గెలుస్తాడో లేడోనని ఆసక్తి నెలకొంది. ఎగ్జిట్ పోల్స్ కూడా జూన్ 2 సాయంత్రం 6.30 గంటల తర్వాతనే విడుదల చేయాలని ఎలక్షన్ కమిషన్ ఆదేశించిన నేపథ్యంలో అభ్యర్థుల గెలుపు ఓటములు ఎలా ఉంటాయో తెలియకుండా ఉంది. అభ్యర్థులు పలువురు తామే గెలుస్తామనే ధీమాలో ఉన్నారు. పోలింగ్ రోజున సర్వే చేయించి అంచనాలపై వస్తున్నారు. సర్వే ఫలితాలు వందశాతం నిజం అయ్యే పరిమితులు తక్కువగా ఉండటంతో అభ్యర్థుల్లో ఆందోళన ఉంటుంది. ఎన్నికలు జరిగిన నాటితో పోలిస్తే కౌంటింగ్ తేది సమీపిస్తున్న కొద్ది అంచనాలు, ఊహాగానాలు మారుతుంటాయి. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ పోలీస్ శాఖ, కేంద్రంలో ఉన్న సెంట్రల్ ఇంటలిజెన్స్ ఆధారంగా గెలుపు ఓటములు అంచనా వేస్తున్నారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నాటి నుంచి సర్వే చేయించగా, పోలింగ్ రోజున కూడా నియోజకవర్గం అంతటా సర్వే చేయించారు. జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలో మహిళల ఓట్లు కీలకం కానున్నాయి. వారి ఓట్లు ఎవరివైపు పడితే వారు విజయ తీరానికి వెళ్లనున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా మరో 20 రోజుల పాటు ఉత్కంఠ కొనసాగనున్నది.



ఈవీఎంలో నిక్షిప్తమైన అభ్యర్థుల భవితవ్యం



దోమకొండలో పది పాములను చంపేసిన గ్రామస్థుడు

ఇంటి సమీపంలో 10 పాములు

దోమకొండ, మే 14: మండల కేంద్రంలోని గడికోట ఎదురుగా నివాసం ఉంటున్న బంజ ప్రకాశ్ తన ఇంటి సమీపంలో 10 పాములను మంగళవారం రాత్రి చంపివేశాడు. తన ఇంటి పక్కన నుంచి ఒకదాని తర్వాత ఒకటి వరుసగా పాములు రావడంతో వాటిని చంపినట్లు ప్రకాశ్ తెలిపారు. అయితే ముందుగా రాత్రి 7.30 గంటల సమయంలో ఒక పాము కనిపించడంతో దానిని చంపడం జరిగిందని మరో 10 నిమిషాల్లో మరొక పాము వచ్చిందని అలా వరుసగా రాత్రి 9 గంటల వరకు 10 పాములు డ్రైనేజీ నుంచి ఇంటి సమీపంలోకి వచ్చి ఇంట్లోకి ప్రవేశించడానికి ప్రయత్నించగా వాటిని చంపివేసినట్లు ఆయన తెలిపారు. ఇందులో రకరకాల పాములు ఉన్నట్లు తెలిపారు. వరుసగా పాములు కాలనీలోకి రావడంతో కాలనీవాసులు భయందోళనకు గురయ్యారు.

వర్షాలు పడే అవకాశం ఉన్నందున ధాన్యాన్ని త్వరగా తరలించాలి

అదనపు కలెక్టర్ చంద్రమోహన్



రైస్‌మిల్లులో బియ్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

కామారెడ్డి టౌన్, మే 14: రెండు రోజుల పాటు ఈదురు గాలులతో కూడిన వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ధాన్యాన్ని రాత్రి పొద్దుపోయాక కూడా లిఫ్ట్ చేయాలని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ నిర్వాహకులకు సూచించారు. మంగళవారం పట్టణంలోని శాబ్దిపూర్‌లో కొనుగోలు కేంద్రాన్ని, క్యాసంపల్లిలో ఓం శ్రీ వేంకటేశ్వర బాయిల్డ్ రైస్‌మిల్లును, పాల్వంచ మండలంలోని భవానిపేటలో భూలక్ష్మీ రైస్‌మిల్, గాయత్రి బాయిల్డ్ రైస్‌మిల్లులను జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి మల్లికార్జున్ బాబుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు పడే అవకాశం ఉన్నందున ధాన్యం రాశులను త్వరగా తూకం వేసి మిల్లులకు తరలించాలన్నారు. రైతులకు అవసరమైన టార్పాలిన్లు అందించాలని, మౌలిక వసతులు కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. రైతులు కూడా ధాన్యం కుప్పలపై టార్పాలిన్లు కప్పి ఎగిరిపోకుండా చూసుకోవాలని తెలిపారు. అధైర్యపడవద్దని తడిచిన దాన్యాన్ని కొనుగోలు చేసి బాయిల్డ్ రైస్‌ను మిల్లులకు తరలిస్తామని అన్నారు. తడిచిన దాన్యాన్ని ఆరబెట్టి తేమ శాతం తగ్గేలా చూడాలన్నారు. అనంతరం బాయిల్డ్, రా రైస్‌మిల్లులను సందర్శించి అక్కడ వేచి ఉన్న లారీల్లో ధాన్యాన్ని వెంటనే అన్‌లోడ్ చేసుకోవాలని, ట్రక్ షీట్ జారీ చేయాలని తెలిపారు.



మాట్లాడుతున్న పార్లమెంట్ బీజేపీ ఇన్‌చార్జ్ పెద్దోళ్ల గంగారెడ్డి

'బీజేపీ నాయకులపై అధికార పార్టీ దౌర్జన్యం'

బిచ్కుంద, మే 14: రాష్ట్రంలో బీజేపీకి పెరిగిన ఆదరణను చూసి ఓర్వలేక అధికార కాంగ్రెస్ పార్టీ బీజేపీ నాయకులు, కార్యకర్తలపై దౌర్జన్యానికి దిగుతున్నారని పార్లమెంట్ బీజేపీ ఇన్‌చార్జ్ పెద్దోళ్ల గంగారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షురాలు అరుణతార ఆధ్వర్యంలో విలేకరుల సమావేశంను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జహీరాబాద్ పార్లమెంట్‌లో ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ లక్ష ఓట్ల మెజార్టీతో గెలుపొందుతారని తెలిపారు. అన్ని నియోజకవర్గాల్లో బీజేపీకి ఆదరణను చూసి నారాయణఖేడ్‌లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సురేష్ షెట్కార్ తమ్ముడు నాగేష్ షెట్కార్ బీజేపీ నాయకులు, కార్యకర్తలపై దాడికి పాల్పడడం సిగ్గు చేటన్నారు. దౌర్జనాల్యకు గుండా గిరీలకు బీజేపీ కార్యకర్తలు, నాయకులు భయపడేవారు కాదని ఒక్కొక్కరు 100 మందితో సమానంగా పార్టీ కోసం పని చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జుక్కల్ నియోజకవర్గ కన్వీనర్ శ్రీధర్ పంతులు, మండల అధ్యక్షుడు మల్లికార్జున్‌దేశాయ్, శివాజీపటేల్, మల్లు దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో కష్టపడ్డ ప్రతీ ఒక్కరికి రుణపడి ఉంటాం

- జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే

నిజాంసాగర్, మే 14: జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో కష్టపడ్డ ప్రతీ ఒక్క బీఆర్ఎస్ కార్యకర్తకు, నాయకులకు రుణపడి ఉంటానని జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే అన్నారు. మంగళవారం నిజాంసాగర్ మండలంలోని గోర్గల్ గ్రామంలో నాయకులతో మాట్లాడారు. గెలుపు ఓటములు సహజమని, పార్టీ కోసం కష్టపడ్డ నాయకులు, కార్యకర్తలు ఇక ముందు కూడా ఇలాగే అందరం కలిసి పని చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జ్యోతి దుర్గారెడ్డి, సీనియర్ నాయకులు దుర్గారెడ్డి, నాయకులు, తదితరులున్నారు.

ప్రమాదం జరిగితేనే పట్టించుకుంటారా?

- గత 5 రోజులుగా వైర్లపై పడి ఉన్న చెట్టు
- భారీ వాహనాలకు తప్పని తిప్పలు

దోమకొండ, మే 14: ప్రమాదం జరిగితేనే పట్టించుకుంటరేమో అని విద్యుత్ శాఖ అధికారులపై విమర్శలు చేస్తున్నారు మండల ప్రజలు. గత 5 రోజుల క్రితం ఈదురుగాలులు వీచడంతో దోమకొండ నుంచి ముత్యంపేటకు వెళ్లే రోడ్డు పక్కన ఉన్న చెట్టు విరిగి విద్యుత్ వైర్లపై పడినా సంబంధిత శాఖ అధికారులు మాత్రం అటు వైపు కన్నెత్తి చూడటం లేదని ముత్యంపేట, చింతమాన్‌పల్లి, దోమకొండతో పాటు తదితర గ్రామాలకు చెందిన ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రతీ రోజు దోమకొండ నుంచి కామారెడ్డికి ఆర్టీసీ బస్సుతో పాటు, వరి ధాన్యం తీసుకెళ్లే లారీలు, వందల సంఖ్యలో వాహనాలు వెళుతుంటాయి. రాత్రి పూట భారీ వాహనాలు అటుగా వస్తే ప్రమాదం సంభవించే అవకాశం ఉందని ప్రయాణికులు చెపుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు ప్రమాదం జరగకమందే చెట్టు కొమ్మలను విద్యుత్ వైర్లపై నుంచి తీసి వేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.



ముత్యంపేట రోడ్డులో విద్యుత్ వైర్లపై విరిగిపడిన చెట్టు

నేను పక్కా లోకల్.. బయటి నాయకులు వస్తారు.. వెళ్లిపోతారు!

- బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ, మే 14: నేను పక్కా లోక్ బాయ్ బయటి నాయకులు వస్తుంటారు.. వెళ్లిపోతారని బాన్సువాడ ఎమ్మెల్యే, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మంగళవారం బాన్సువాడ పట్టణంలోని ఓ టీ సాల్ట్ వద్ద ఆగి నాయకులు, ప్రజలతో కలిసి సరదాగా టీ తాగుతూ ముచ్చటించారు. నేను పక్కా లోకల్ బాయ్ అప్పుడైనా ఇప్పుడైనా ఎప్పుడైనా నేను మాత్రం బాన్సువాడ లోకల్ అని ఆయన పేర్కొన్నారు. గత నెల రోజుల నుంచి జహీరాబాద్ ఎంపీ నాలుగో విడత ఎన్నికల ప్రచారంలో బీజీబిజీగా గడిపిన ఎమ్మెల్యే పోచారం ప్రజలతో, నాయకులతో కలిసి సరదాగా బాన్సువాడ పట్టణంలో పర్యటించారు. ఎలక్షన్ వస్తుంటాయి. పోతుంటాయి. కానీ బయటి నుంచి వచ్చిన నాయకులు మాత్రం ఓట్లు అయిపోగానే వాళ్ల ఊరికి వారు వెళ్లిపోతుంటారు. నాకు మాత్రం బాన్సువాడ నా ఊరు ఇదే నా ఇల్లు ప్రజలే నా కుటుంబం అంటూ చాయిని అస్వాదిస్తూ నాయకులు, ప్రజలతో కలిసి ఆయన పేర్కొన్నారు.



బాన్సువాడ పట్టణంలో టీ తాగుతూ నాయకులు, ప్రజలతో సరదాగా ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే పోచారం

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

దర్శన్ - కింగ్‌డమ్ ఆఫ్‌ది ఆప్స్
శాంతి - టిల్లు స్క్వేర్
ప్రియా 70 - క్రిష్ణమ్మ
ప్రియా 35 - ప్రతినిధి-2

బాన్సువాడ

మహేశ్వరి - బాక్
వెంకటేశ్వర - కృష్ణమ్మ

చికెన్ ధరలు



రకం	:	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
వెన్‌కాబ్(కిలో)	:	100	180	210

